కథ

అదుర్తి బాల

**అద్దంలో చూసుకుంది కస్తూరి. కళ్ళు కలువ రేకులట. నాసిక సంపంగిట. అధరాలు దొండపళ్ళు! ఛీ... అరిగిపోయిన రికార్డులాగా ఈ కవులకి ఇంతకన్నా మించి స్త్రీ సౌందర్యాన్ని వర్ణించడం చేతకాదు. ఈ లక్షణాలేవీ లేకపోయినా తనకి తను నచ్చుతుంది. నిజానికి వ్యక్తిత్వానికి మించిన అందం ఆడదానికేముంది? అయినా స్త్రీని కూడా వ్యక్తిగా గుర్తించే మహానుభావులెందరు ఈ లోకంలో! ఆనాటి రాజుల కాలం నుంచీ ఈనాటి హైటెక్ యుగం దాకా ఆడదెపుడూ భోగవస్తువే మగాడికి. కాకపోతే మరేమిటి? పెళ్ళిచూపులకొచ్చే ప్రతి మగవాడు కాబోయే భార్య వ్యక్తిత్వ పరిశీలన చెయ్యడు. బాహ్య సౌందర్యాన్నే పరిశీలిస్తాడు.**

# పెళ్ళిచూపులు

ఈసారి తను నచ్చలేదని అంటే వాడి ఎదురుగా అద్దం పెట్టి ముందు నువ్వెలా ఉన్నావో చూసుకో అని చెప్పాలి- కసిగా అనుకుంది కస్తూరి.

"ఇంకా అలాగే ఉన్నావేమిటే.. అవతల వాళ్ళొచ్చే టైమవుతోంది త్వరగా తెములు" వంటింట్లోంచి అరుస్తోంది కస్తూరి తల్లి.

ఎలా ఉన్నాను. మళ్ళీ అద్దంలో చూసుకుంది కస్తూరి. అప్పుడే ఎండలోంచి నడచి వచ్చిందేమో తలలోంచి జారి చెంపలపై జారుతోంది చెమట. జిడ్డోడుతున్న ముఖం! అయినా తనేమైనా విశ్వ సుందరి పోటీకెడుతోందా అంతలా తయారవడానికి! ఆఫ్టరాల్ పెళ్ళిచూపులేగా అనుకోగానే కస్తూరికి నవ్వొచ్చింది.

తనలో తను నవ్వుకుంటున్న కూతుర్ని చూడగానే సుందరమ్మ మనసు స్థిమిత పడ్డది. ఎంతైనా ఆడపిల్ల కదా..పెళ్ళిచూపులంటే ఇదివరకూ ఉన్న అయిష్టత పోయినట్టుంది. వయసులో ఉన్న పిల్ల కదా పెళ్ళిమీద ఆశలుండడం సహజం. ఎలాగైనా ఈ సంబంధం ఖాయమయితే తన బాధ్యత తీరిపోతుంది అనుకుంది.

"ఇంకా అలాగే ఉన్నావేమిటే త్వరగా ముఖం కడుక్కుని తయారవు. అలా పైపైన కడిగేసుకోవడం కాదు. సబ్బుతో బాగా తోమి కడుక్కో. ముఖం నిండా చెమట చూడు ఎలా కారుతోందో!" కస్తూరి పెళ్ళిచూపులు దగ్గరుండి జరిపించడానికి వచ్చిన కస్తూరి అక్కయ్య వేదవతి హెచ్చరించింది.

"అక్కా- చెమటని అలా చిన్నచూపు చూడకు. ఎండ వేడి నుండి శరీరాన్ని చల్లబరచి బాడీ టెంపరేచర్ కంట్రోల్ చేసే రక్షణ చర్య అది"

"బాబోయ్ నీ ఉపన్యాసం ఆపు. అవతల వాళ్ళొచ్చే టైమవుతోంది. తొందరగా మొహం కడుక్కురా.." కస్తూరిని బాత్రూం వైపు లాక్కెళ్ళింది వేదవతి.

నవ్వుకుంటూ ముఖం కడుక్కోవడానికి వెళ్ళింది కస్తూరి.

"అదేమిటే ముందు ఫేస్ క్రీం రాసుకోమన్నానుగా పౌడర్ రాసేసుకున్నావా..." ముఖం తుడుచుకుని పౌడర్ రాసుకుంటున్న చెల్లెలిని ఉద్దేశించి అన్నది వేదవతి.

"అయ్యో..ఎంతటి అపరాధం జరిగిపోయింది. అసలు ఈరోజు పెళ్ళిచూపులని రెండు రోజులు ముందే చెపితే నీ సొమ్మేం పోయిందే. ఏ బ్యూటీ క్లినిక్కో వెళ్ళి ముఖానికి బ్లీచింగ్ చేయించుకునే దాన్నిగా. పోనీలే.. ఇంకోసారి ముఖం రుద్దుకోనా సబ్బుతో.." నవ్వుని దాచుకుంటూ అమాయకంగా ముఖం పెట్టి అన్నది కస్తూరి.

"అఖ్ఖర్లేదు. ఇంకొంచెం పౌడర్ రాయి ముఖం కాస్త బ్రైట్‌గా ఉంటుంది" కస్తూరి వేళాకోళాన్ని పట్టించుకోలేదు వేదవతి.

"మొహం మరీ సున్నం పిడతలా ఉంటుందేమో! ఒకవేళ ఈ మేకప్ చూసి మురిసిపోయి ఆ వచ్చేవాడు పెళ్ళి చేసుకున్నా..ఆ తర్వాత ఏ బట్టలుతుకుతున్నప్పుడో, అంట్లు తోముతున్నప్పుడో ఈ మేకప్ కరిగిపోతే నా ఒరిజినల్ గెటప్ చూసి మూర్ఛపోతాడేమో" సందేహం వెలిబుచ్చింది కస్తూరి.

"నీ వేళాకోళం ఆపి ఈ చీర కట్టుకో" వేదవతి తను ఈమధ్యనే కొనుక్కున్న జరీ బుటాలున్న పసుపురంగు పట్టుచీర చెల్లెలికిచ్చింది.

"అబ్బా క్రితంసారి పెళ్ళిచూపులకీ ఈ చీరే ఇచ్చావు. ఈ తెలుగుదేశం రంగు చూడగానే వచ్చిన వాడు కుర్చీలోంచి లేచి చక్కాపోయాడు. బహుశా వాడు కాంగ్రెస్ పార్టీ వాడు అయ్యుంటాడు. ఎందుకైనా మంచిది ఈసారి వచ్చేవాడు ఏ పార్టీనో తెలుసుకుని ఆ రంగు చీరకడితే బాగుంటుంది కదూ! ఎలా ఉంది మన ఐడియా!" అక్క కళ్ళలోకే చూస్తూ అన్నది కస్తూరి.

"కిందటిసారి వచ్చినవాడు ఈ చీర రంగు చూసి పారిపోలేదు. నువ్వు అడిగిన అడ్డమైన ప్రశ్నలకీ తట్టుకోలేక వెళ్ళిపోయాడు. అయినా కట్నాలు కానుకలు గురించి నువ్వు మాట్లాడకూడదు. అవన్నీ మేం చూసుకుంటాం. నీ పనల్లా తలవంచుకు కూర్చొని వాళ్ళడిగిన ప్రశ్నలకి జవాబు చెప్పడమే" కోపంగా అన్నది వేదవతి.

"వాళ్ళు అడ్డమైన ప్రశ్నలూ అడిగితే తప్పులేదు గానీ నేను నా సందేహాలు అడిగితే తప్పా! మన తాహతుకి మించిన కట్నం అడిగితే అంత కట్నం మా నాన్న ఇచ్చుకోలేడని చెప్పాను. అది తప్పా!"

"నువ్వు మాట్లాడేదేదీ తప్పు కాదు. నాన్న రిటైర్ అవకుండానే నీ పెళ్ళి కూడా చేసేద్దాం అనుకున్న మాదీ తప్పు" లెంపలేసుకుంటూ అన్నది వేదవతి.

"మీ గొడవ ఆపి ముందర దాన్ని కాస్త రెడీ చెయ్యి" పెద్దకూతురిని హెచ్చరించింది సుందరమ్మ.


"ఇంతకీ ఏ చీర కట్టుకుంటావు? పోనీ నా బిన్నీ సిల్కు చీర కట్టుకో"

"ఆ బూడిదరంగు చీర నాకు నచ్చదు బాబూ- పోనీ నువ్వు కొత్తగా కొనుక్కున్న కళాంజలీ చీర ఇస్తావా ఆ చీరలో నేను వాళ్ళకి నచ్చి తీరతానని నా సిక్స్త్ సెన్స్ చెప్తోంది" ఆ కొత్త చీర అక్క ఇంకా కట్టలేదనీ తన పెళ్ళి రోజుకని దాచుకున్నదనీ తెలిసి అక్కని ఉడికించడానికి అన్నది కస్తూరి.

"ఆ చీర ఇచ్చేది లేదు. నీకు తోచిన బట్టలు కట్టుకొని తగలడు" కోపంగా అన్నది వేదవతి.

"హమ్మయ్య ఇప్పటికి నాకు నా బట్టల విషయంలో స్వతంత్రమిచ్చావు. ఇప్పుడే మా ఫ్రెండ్ రజియాకి ఫోన్ చేసి దాని బురఖా తెమ్మంటాను. ఈసారి పెళ్ళిచూపులకి బురఖాలో తయారైతే వెరైటీగా ఉంటుంది" జోక్ చేస్తున్నట్టు నవ్వుతూ అన్నది కస్తూరి.

"మహాతల్లీ కొంపతీసి అంత పనీ చేయకు. ఈ



బిన్ని సిల్క్ శారీ కట్టుకో'' కస్తూరి మీదకి చీర విసిరేసి మిగతా ఏర్పాట్లలో తల్లికి సహకరించడానికి వెళ్ళిపోయింది వేదవతి.

రాబోయే పెళ్ళివారిని ఎలా ఆటాడించాలో ఊహించుకుంటూ తయారవసాగింది కస్తూరి.

★ ★ ★

ఇంటి ముందర టాక్సీ ఆగిన చప్పుడు వింటూనే కిటికీ లోంచి తొంగి చూసింది కస్తూరి. సుమారు ఓ వంద కిలోల బరువు తూగే భారీకాయం దిగింది. ఆపసోపాలు పడుతూ అరచేతి వెడల్పున్న జరీ అంచు పట్టు చీర, మెడ కనిపించకుండా నగలతో కొత్త స్టీలు బిందెలా ధగధగలాడి పోతోంది. బహుశా ఈవిడే అబ్బాయి తల్లి అయి ఉండచ్చు అనుకుంది కస్తూరి. ఆవిడ దిగిన వెంటనే చెరుకు గడలా బక్కపలుచని శాల్తీ దిగింది. ఆవిడ భర్తగారు అవచ్చేమో..బొత్తిగా భార్యా విధేయుడిలా ఉన్నాడు. ఆ వెనుక ఇంచుమించు అత్తగారి పర్సనాలిటీతో తులతూగే ఓ ఆడమనిషి, ఆ పక్కన జూనియర్ ఎన్‌టిఆర్ లాటి మగ మనిషి దిగారు. వాళ్ళిద్దరూ తన కాబోయే ఆడపడుచూ..పెళ్ళికొడుకూ అని ఊహించడానికి ఎక్కువసేపు పట్టలేదు కస్తూరికి.

''అమ్మాయిని తీసుకురండి..'' కాఫీ ఫలహారాలు అయ్యాక అన్నారు వాళ్ళు.

పెళ్ళిచూపులనే నాటక రంగంలో తన వంతు పాత్రలో జీవించేయాలి అనుకుంది కస్తూరి.

''నీ పేరేంటి?'' అడిగింది అబ్బాయి తల్లి వరహాలమ్మ.

''కస్తూరి అండి''

''ఏం చదూతున్నారు''

'అవేమీ తెలుసుకోకుండానే పెళ్ళిచూపుల వరకూ వచ్చారా' అనబోయిన కస్తూరి ''మా చెల్లెలు బి.యస్.ని చదుతోందండీ. మంచి తెలివైంది. ఇప్పటివరకూ అన్ని పరీక్షలూ ఫస్ట్ క్లాస్ లోనే పాస్ అవుతూ వచ్చింది. ఇంటి పనులు కూడా చక్కగా చేయగలదు'' అన్న వేదవతి మాటలతో అప్పటికి ఏమీ మాట్లాడలేదు.

''ఆ కాసులపేరు, వడ్డాణం నీదేనా'' అడిగింది వరహాలమ్మ. కస్తూరికి నవ్వొచ్చింది. అక్కవంక చూసింది ఏం చెప్పనన్నట్టు. వేదవతి మొహంలో ఆందోళన కనిపించింది.

''నావి కావు మా అక్కవండీ'' వరహాలమ్మ ముఖంలో ఫీలింగ్స్ చదువుతూ అన్నది కస్తూరి. ఆవిడ మొహంలో నిరుత్సాహం కొట్టొచ్చినట్టు కనిపించింది.

''పోనీలే మీ నాన్న నీకూ పెళ్ళి నాటికి చేయిస్తాడులే అచ్చు లక్ష్మీదేవిలా ఉన్నావు ఈ నగలతో'' కస్తూరి తండ్రి వంక చూసి అన్నది వరహాలమ్మ.

సుదర్శనరావు గుండెలో రాయిపడింది. ఎంత తక్కువలో చూసినా ఆ రెండూ కలిపి ఎనభై వేలకి తగ్గదు అనుకున్నాడు.

అప్రయత్నంగా తండ్రి వంక చూసింది కస్తూరి. ఇంట్లో పులిలాగా ఉండే మనిషి వీళ్ళ ముందు మేకలా కనిపించాడు.

"ఈ నగలు మా నాన్న చేయించలేదండీ పెళ్ళయ్యాక మా అక్క ముచ్చట పడిందని మా బావ గారే చేయించారు"

వరహాలమ్మ మాట్లాడేదు కానీ కస్తూరి మాటల్లో అంతరార్థం అర్థం అయింది. పిల్ల గడుగ్గాయే అనుకుంది.

"పాటలూ..సంగీతం ఏమైనా నేర్చుకున్నారా" ఇంకో ప్రశ్న ఆడపడుచు హోదాలోని వ్యక్తి నుంచి వచ్చింది.

"చాలా బాగా పాడతాను. మీకు ఏ రకం పాటలు కావాలి. శాస్త్రీయ సంగీతమా, లలిత గీతాలా? సినిమా పాటలా?"

"పాడుతా తీయగాకి ట్రై చేశారా?" కుతూహలంగా అన్నాడు పెళ్ళి కొడుకు.

## మంచిదికాదు

**ఏది మంచిదికాదు అనేగా మీ సందేహం? ఆ విషయం గురించే చెబుతున్నా అంటోంది బెంగాలీ రసగుల్లా బిపాషా. 'చాలామంది ఆడవాళ్ళు ఎక్కువగా ఆభరణాలు కొనేసుకుని నడిచే నగల దుకాణాల్లా కన్పిస్తుంటారు. ఇదే మంచిది కాదు' అంటోంది. అన్నట్టు ఈతరం అమ్మాయిలు డిజైనర్ దుస్తులకి నప్పే ఆభరణాలకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు. మనకి అందం ఉంటే ఆభరణాల అవసరం అంతగా ఉండదు. నేనైతే చాలా సింపుల్‌గా ఉండడానికే ప్రాముఖ్యత ఇస్తాను' అని తెగ చెప్పుకుపోతోందీ జవ్వని.**

"ట్రై చేద్దామనే అనుకున్నా కానీ పాట విని పి.సుశీల, ఎస్.జానకి లాటివాళ్ళు అసూయ పడతారని...ఇంత మంచి టోన్ తమకి లేదని బాధపడతారని పోటీలో పాల్గొనలేదు" నవ్వుదాచుకుంటూ అన్నది కస్తూరి.

"మీరు అన్నీ విచిత్రంగా మాట్లాడుతున్నారు. కాస్త సరదా మనిషనుకుంటాను. కుట్లూ, అల్లికలూ వచ్చా? మీ హాబీస్ ఏమిటి?" ఆడపడుచే అడిగింది మళ్ళీ.

"కుట్లూ, అల్లికలంటే పెద్ద ఇంట్రెస్టు లేదుకానీ హాబీగా నేర్చుకున్నవి అవసరానికి పనికొస్తాయని అనుకొన్నవి కొన్ని నేర్చుకున్నాను"

"ఏమిటో అవి-" నవ్వుతూ అన్నాడు పెళ్ళికొడుకు.

"కరాటే, జూడో, కుంగ్‌ఫూ"

"వాటితో అవసరమేంటి మీకు?" ఆశ్చర్యపోయాడతడు.

"ఈరోజుల్లో ఆడపిల్లకి ఇవి చాలా అవసరం. మీరడిగిన కట్నం మావాళ్ళెలానూ ఇవ్వలేరు. అలాగని సంబంధమూ ఒదులుకోలేరు. మధ్యతరగతి మనుషులం కదా అప్పోసప్పో చేసి కూతుర్ని ఓ మెట్టుపైనే ఉంచాలనుకుంటారు. అది మా వీక్‌పాయింట్..అదే మీ స్ట్రాంగ్ పాయింట్ కూడా. అందుకే బాకీ ఉన్న కట్నం కోసం మా వాళ్ళని తోడేళ్ళలా పీక్కుతింటారు.

మావాళ్ళ అసహాయత తెలిసీ నన్ను హింసించడం మొదలు పెడతారు. ఏ అర్థరాత్రో నావంటి మీద కిరోసిన్ పోసి అంటిద్దామని ప్రయత్నిస్తారు. అలాటప్పుడు ఆత్మరక్షణ చేసుకోవాలిగా మరి. అందుకే ముందు జాగ్రత్తగా నేమీ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం సంపాదించానన్నమాట."

కస్తూరి చెప్పడం పూర్తయి అందరి మొహాల వంకా చూసింది.



వరహాలమ్మ మొహంలో భయం కనిపించింది. ఆవిడ భర్తగారి ముఖంలో ఆనందం! ఎవరికీ భయపడని భార్యని ఒక్కక్షణమైనా భయానికి గురిచేసిన కస్తూరి మీద గౌరవం పెరిగింది ఆయనకి.

"ఇందాకట్నించి చూస్తున్నాను.. ఇంత పెడసరపు మాటలు నేనెక్కడా వినలేదు. పెద్దలంటే గౌరవం లేదు. భయం లేదు. ఇంత రాక్షసి పిల్లకి పెళ్ళెలా అవుతుంది. అమ్మాయిని కాస్త అదుపులో పెట్టుకోండి" కోపంగా లేస్తూ అన్నది వరహాలమ్మ.

"ఇన్ని గొంతెమ్మ కోరికలు కోరితే మీ అబ్బాయి పెళ్ళెలా జరుగుతుందో అదీ చూద్దాం!" తనూ రెచ్చిపోతూ అన్నది కస్తూరి.

"ఛీ..ఇలాంటి గతిలేని వాళ్ళ ఇంటికి రావడం మనదే బుద్ధి తక్కువ ఇంకా చూస్తారే లేవండి" భర్త వంక చూసి హుంకరించింది వరహాలమ్మ.

"ఆగండి మీరు తిన్న టిఫిన్‌కి, కాఫీకి అయిన ఖర్చు అక్కడ పెట్టి కదలండి" ఇంకా గట్టిగా అన్నది కస్తూరి తల్లిదండ్రులు వారిస్తున్నా వినకుండా.

అందరూ గుమ్మం దాటుతుండగా వెనక్కి వచ్చాడు వరహాలమ్మ భర్త .

కస్తూరి చేతిలో వంద రూపాయల కాగితం పెట్టి అన్నాడు-

"నీ ధైర్యం తల్లిదండ్రుల పరిస్థితిని అర్థం చేసుకునే నీ వ్యక్తిత్వం నాకు నచ్చాయమ్మా. నీలాగా ప్రతి ఆడపిల్లా కట్నాలు తీసుకునే పెళ్ళిని వ్యతిరేకిస్తే ఆడపిల్ల పెళ్ళంటే భారం అవదు తల్లిదండ్రులకి. అది ఓ పండుగ అనిపిస్తుంది"

★ ★ ★

"ఎంతైనా మంచి సంబంధం చెడగొట్టుకున్నావు.

అత్తగారు గయ్యాళి అయితే మాత్రం..అబ్బాయి మంచి ఉద్యోగస్తుడు" బాధగా అన్నాడు సుదర్శనరావు.

"ముందు నా చదువయ్యే వరకూ పెళ్ళొద్దని చెప్పాగా నాన్నా..నా కాళ్ళ మీద నేను నిలబడేవరకూ ఏ పెళ్ళి ప్రయత్నం చేయద్దు. నాకంటూ ఓ సంపాదన ఉన్న తరువాతే పెళ్ళి" స్థిరంగా అన్నది కస్తూరి.

"ఎంతైనా ఈ కాలం పిల్లలు..వాళ్ళ ధోరణే వేరు. కస్తూరి ఆలోచనే సరైనదేమో!" అనుకుని నిట్టూర్చాడు సుదర్శనరావు.